క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కందుకూరు రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను గురువారం అందజేశారు. వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం పంచాయతీ 10వ వార్డుకు మెంబర్ ఎద్లూరి ఆంజనేయులు పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. హెచ్‌ఎం అనూరాధ మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మహాల్యాలారావు, పెరుగు ప్రసాదరావు, చిత్తూరు వెంకటేశ్వర్లు బొల్లా రవిబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

వెలిగండ్ల: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని తనిఖీ అధికారి బి. కోటేశ్వరి అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2018–19 నుంచి 2021–22 సంవత్సరాల వార్షిక తనిఖీలో భాగంగా గ్రంథాలయంలోని పుస్తకాలను, గ్రంథాలను, దిన, వార, మాస పత్రికలను, రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథపాలకుడు భాస్కర్, పాఠకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.కోటేశ్వరి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు.

75 శాతం సబ్సిడీపై పశు గ్రాసం విత్తనాలు

లింగసముద్రం: పాడి రైతులకు ప్రభుత్వం 75 శాతం రాయితీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తుందని పశువైద్యాధికారి డాక్టర్ వైవీ కామేశ్వరరావు తెలిపారు. పశుగ్రారంవిత్తనాలు 75 శాతం సబ్సిడీపై రూ.24 ఇస్తున్నట్లు చెప్పారు. పశుగ్రాసం విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డ్ జిరాక్స్‌తో పాటు ఫోన్ నంబర్‌ను తెచ్చుకోవాలన్నారు.

ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని బసిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన దోర్శిల వర్షిని ఎన్‌ఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సలీంబాష తెలిపారు. 8వ తరగతి చదువుతున్న వర్షిని జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌ఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణ సాధించి మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని, సంవత్సరానికి రూ.12వేల స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.

వలేటివారిపాలెం: ఆదర్శ పాఠశాల ముగ్గురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు తెలిపారు. మండలంలోని చుండి గ్రామ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు బోడా నవ్యశ్రీ, ప్రగడ రాకేష్, చెరువుపల్లి కృతిక సాయి కోటిలు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు అర్బన్: కందుకూరు పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛత 2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. వ్యక్తిగత స్వయం సహాయక చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రం, వ్యర్థాల శుద్ధి, చెత్త సేకరణ , కళాకృతులు తయారీ, తడి చెత్త వినియోగం వంటి విభాగాల కింద కృషి చేస్తున్న మహిళలు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు వారు ఈ నెల 31 తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. విజేతలకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులు అందజేస్తామని తెలిపారు.

95 మద్యం బాటిళ్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

పీసీపల్లి: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై నాగేశ్వరరావు సిబ్బందితో సోదాలు చేసి చెరుకుపల్లి సాయికృష్ణను అరెస్టు చేసి అతని వద్ద 85 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాతల సహకారం మరవలేనిది



విద్యార్థులకు హాట్‌బాక్స్‌లు అందజేస్తున్న దాత

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని బసిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 130 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దోర్శిల బాలిరెడ్డి హాట్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సలీంబాష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు.

25 నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు



ఏకశిల పట్టాభి సీతారామచంద్ర స్వామి మూల విరాట్



బోయమడుగులలోని పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయం

సీఎస్‌పురం(కనిగిరి): మండలంలోని బోయమడుగుల లోని 150 సంవత్సరముల చరిత్ర కలిగిన ఏకశిల పట్టాభి సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి యంత్ర సహిత సుదర్శన చక్ర శిఖర ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25 న విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అజశ్రీ దీపారాధన, రక్షా బంధనం, రుత్విక్ వారణ, వాస్తుపూజ, వాస్తు హోమం, 26న అగ్ని ప్రతిష్టాపన, పంచగవ్య ఆరాధన, స్నపన తిరుమంజనం, హోమాలు, 27న యంత్ర సహిత సుదర్శన చక్ర శిఖర ప్రతిష్టా మహోత్సవం, పూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చంద్రబాబు జైలుకెళ్లడం ఖాయం



కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



ప్రభపై మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్‌రావు, పక్కన డాక్టర్ వెంకయ్య

కొండపి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జాళ్లపాలెం తిరునాళ్లలో బుధవారం రాత్రి కట్టావారిపాలెం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 110 అడుగుల విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ న్యాయ సలహాదారులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు, జిల్లా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తిరునాళ్లకు హాజరయ్యారు. వీరబ్రహ్మం మఠంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యుత్ ప్రభపై వారు మాట్లాడుతూ.. పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి పాటుపడేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.370 కోట్లు దోపిడీ చేసిన చంద్రబాబు జైలుకు పోవటం ఖాయమన్నారు. కొండపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి టీడీపీ పాలనలో పేదల మరుగుదొడ్ల డబ్బు తిని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. మూడుసార్లు ఓట్లేపించుకున్న స్వామి నియోజకవర్గ సమస్యలను గాలికొదిలేసి కోవిడ్ సమయంలో ఇంట్లో దాక్కున్నాడని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో స్వామికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డపాటి అరుణమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కిసం ఉపేంద్రచౌదరి, రావెళ్ల రాజీవ్‌చౌదరి, బొక్కిసం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు చేస్తున్న బాబూరావు కుటుంబసభ్యులు

సీఎస్‌పురం(కనిగిరి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, దత్త సాయిబాబా మందిర నిర్మాణాలకు గురువారం వైభవంగా శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు తన సొంత నిధులతో మండలంలోని సీఎస్‌పురం, కోవిలంపాడు గ్రామాల మధ్యలో మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి సమీపంలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి, దత్త సాయిబాబా ఆలయాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం గురువారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య కదిరి బాబూరావు కుటుంబ సభ్యులు ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. కదిరి బాబూరావు సోదరులు ప్రకాశరావు, పార్థసారధి, బాలకృష్ణ, చందనా పట్టాభిరామేశ్వరరావు, సుంకరి వెంకటాద్రి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్స్‌దే కీలకపాత్ర



గ్రీన్ అంబాసిడర్స్‌కు శిక్షణ ఇస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి శోభన్‌బాబు

పామూరు: జగనన్న స్వచ్ఛసంకల్పంలో గ్రీన్ అంబాసిడర్స్‌దే కీలకపాత్ర అని డివిజనల్ పంచాయతీ అధికారి శోభన్‌బాబు అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం శిక్షణ కార్యక్రమం మొదటిరోజు గురువారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో సీఎస్‌పురం, దర్శి మండలాలకు చెందిన గ్రీన్ అంబాసిడర్లకు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్స్ చెత్త సేకరణ సమయంలోనే తడిచెత్త, పొడిచెత్తను విభజించుకోవాలన్నారు. ప్రజలు కూడా ఇందుకు సహకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో చెత్త సేకరణలో అవలంబించాల్సిన పద్ధతులు వివరించారు. రామ్మోహన్, సురేష్, ఎంపీడీఓలు, ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని రెండు ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖ ఒంగోలు ఏడీఏ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోకూరి వెంకటేశ్వర్లు అండ్ సన్స్, గాదంశెట్టి శ్రీరాములు అండ్ సన్స్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, పురుగు మందులు అమ్మాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖాధికారి కేవీ శేషారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



పొన్నలూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాధవరావు

పొన్నలూరు: గ్రామాల్లో రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గురువారం శనగ కొనుగోళ్లను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. శనగలు క్వింటాకు రూ.5335 గిట్టుబాటు ధర నిర్ణయించిందన్నారు. శనగలను కొనుగోలు చేసి పది రోజుల్లోనే రైతు బ్యాంక్ ఖాతాకు నగదు జమచేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ గొల్లపూడి వెంకటరమణయ్య, సొసైటీ కార్యదర్శి వి.మనోజ్‌కుమార్, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: మండలంలోని నేలటూరి గొల్లపల్లిలోని కాట కోటేశ్వర, గంగాభవాని తిరునాళ్ల మహోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆలయంలో విశిష్ఠ పూజలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన వేదికపై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఏపీమెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, వేల్పుల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ గాలిబోయిన ధనుంజయ్, శ్రీహరిరెడ్డి, కాసుల గురవయ్య యాదవ్, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో మాట్లాడుతున్న రిలియన్స్ ఫౌండేషన్ అధికారులు

హనుమంతునిపాడు: నీటి సంరక్షించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని రిలియన్స్ ఫౌండేషన్, సార్ప్ సంస్థ ప్రతినిధి నవీన్, కేపీ రావు అన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. రిలియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి సంరక్షించేందుకు చెక్‌డ్యామ్ పనులు, కుంటలు పూడిక నిర్మాణాలు, చెరువు కట్టల బలోపేతం చేయడం ఫామ్ పాండ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షం నీరు వ్యర్థం కాకుండా నీటిని నిల్వ చేసి సంరక్షించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమణయ్య, రమణారెడ్డి, గ్రామస్తులు, రైతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుమ్మకుంటలో వాటర్ ట్యాంక్ ప్రారంభం



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు

కనిగిరి రూరల్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తుమ్మకుంటలో రిలయన్స్ ఫౌండేషన్, షార్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను గురువారం ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ సాగునీరు, తాగునీటి ప్రాముఖ్యతను వివరించారు. నీటి చాలా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం రిలయన్స్ ఫౌండేషన్, షార్ప్ సంస్థల ఆధ్వర్యంలో 40 మంది రైతులకు గడ్డి విత్తనాలు, 50 మందికి కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ ఓబులేసు, ఫౌండేషన్స్ ప్రతినిధులు రాజేశ్వరరావు, లక్ష్మీరెడ్డి, చిన్నబాబు, వెంకటేశ్వర్లు, ఎలీషా, సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనదారులకు రూ.1.10 లక్షల జరిమానా



వాహనాలను తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్

టంగుటూరు: వాహనదారులు నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. జగదీష్ సూచించారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద గురువారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన 47 వాహనాలకు రూ.1.10 లక్షల జరిమానా విధించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



నగదును అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో తాళ్లూరి లక్ష్మీనారాయణ (48) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులకు గురువారం మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను చైర్మన్ గఫార్, కౌన్సిలర్ జాస్మిన్ షఫీ చేతుల మీదుగా అందచేశారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ ఎస్‌కే జాస్మిన్ ఆజాద్, సచివాలయ అధికారులు మజీద్, రామగోపాల్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



ముప్పళ్లపాడులో జగనన్న కాలనీలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని ముప్పళ్లపాడులో జగన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులు పరిశీలించారు. పనులు నాణ్యతలో తేడా లేకుండా చూడాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు, ఏఈలు కొండయ్య అఖిలున్నారు.

766 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో 766 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. దావగూడూరు, చింతలపాలెం గ్రామాలకి చెందిన రైతులు 841 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 766 కొనుగోలు చేయగా 38 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200 కాగా, కనిష్ట ధర రూ.171 పలకగా, సరాసరి రూ.195.58 పలికింది. వేలంలో మొత్తం 14 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

జాబ్ కార్డుదారులందరికీ పని కల్పించాలి

సింగరాయకొండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి తప్పనిసరిగా ఉపాధి హామీ పథకం కింద పని కల్పించాలని జిల్లా విజిలెన్స్ అధికారి, ఇన్‌చార్జి ఏపీడీ వెంకటస్వామి సూచించారు. స్థానిక మండల కాంప్లెక్స్‌లోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గురువారం గ్రామ స్థాయి సిబ్బందితో సమావేశమయ్యారు. ఏపీడీ మాట్లాడుతూ.. మండలంలో రోజూ 2 వేల మందికి తగ్గకుండా పని కల్పించడంతోపాటు కూలీలకు 257 రూపాయలు వేతనం వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా పాకలలో ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ పరిశీలించారు. ఊళ్లపాలెం గ్రామంలో అమృత్‌సరోవర్ పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన బంగారుకుంటను పరిశీలించారు. ఏపీఓ సీహెచ్ నాగరాజు, ఈసీ శ్రీనివాసరావు, టీఏలు నరసింహారావు, రాజారావు, సునీత, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కొండపిలో అకాల వర్షం

కొండపి: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం గాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని పెరిదేపి, ముప్పవరం తదితర గ్రామాల్లో వర్షంతో పాటు వడగండ్లు సైతం పడ్డాయి. ప్రస్తుతం పొగాకు, శనగ పంట పొలాల్లో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి ఇదే వర్షం కురిస్తే శనగ పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖాధికారి రాము తెలిపారు. రైతులు పొగాకు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొగాకు బోర్డు అధికారులు తెలిపారు. వర్షానికి గాలి తోడు కావటంతో విద్యుత్‌లైన్‌లలో ఇబ్బంది తలెత్తి కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడింది.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పామూరు: సమాజంలో మార్పుకోసం నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక కందుకూరు రోడ్డులోని భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే దేశంకోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు పోరాటాలు చేసి ప్రాణాలర్పించి వీరులయ్యారన్నారు. మరోమారు మతోన్మాద, జాతివ్యతిరేక శక్తులపై యువత భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ కనిగిరి నియోజకవర్గ సహాయకార్యదర్శి వజ్రాల సుబ్బారావు, పేరం రఘునాథరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పాలపర్తి మస్తాన్‌రావు, రాగిపాటి సూరిబాబు, ఆకుల మోహన్ రావు, అబ్బిశెట్టి నరసింహారావు, ఇర్రి వెంకటరెడ్డి, పేరం రఘునాథరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

కొండపి: దేశం కోసం చిన్న వయసులోనే ఉరితాడును ముద్దాడిన విప్లవవీరుడు భగత్‌సింగ్ అని సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్ అన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి కేజీ మస్తాన్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ భారతదేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేశారన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారి త్యాగాలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం వారి ఆశయాలకు తూట్లు పొడవడమే అన్నారు. రూబెన్, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పని కావాలని అడిగిన ప్రతి కూలీకి పని లేదనకుండా కల్పించాలని ఏపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధి కార్యాలయంలో గురువారం టీఏలు, ఎఫ్ఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చెక్ డ్యామ్‌లు పూడిక, కుంటలు పూడిక పనులు నిర్వహించాలని, పనికి వచ్చిన కూలికే మస్టర్ వేయాలన్నారు. ఇచ్చిన కొలతలు చేస్తేనే గిట్టుబాటు కూలి వస్తుందని చెప్పారు. ఈసీ చాణక్య, టీఏలు టి.కిషోర్, వెంకట్రావు, అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, రజనీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడి లాంటివి

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నపిల్లలకు అమ్మఒడి లాంటివని ఐసీడీఎస్ సీడీపీఓ సరోజిని అన్నారు. మండలంలోని వగ్గంపల్లి, బోడవాడ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సరోజిని మాట్లాడుతూ బియ్యానికి బదులుగా ముడిధాన్యాలను వినియోగించుకోవాలని, వాటిద్వారా శక్తి, విటమిన్‌లు అధికంగా అందుతాయని తెలిపారు. కూరగాయలను వీలైనంత వరకు పెరటిలో పెంచుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించి కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని సక్రమంగా ఇవ్వాలన్నారు. బోడవాడలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ హ్యాండ్‌వాష్ చేసే విధానాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు, గర్భిణులు, బాలింతలకు వివరించారు. సూపర్‌వైజర్‌లు గోళ్ల పద్మజ, కే.దేవకృపావరం అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

27న వికలాంగులకు బస్‌పాస్‌ల అందజేత

మద్దిపాడు: మండలంలోని దివ్యాంగులకు ఈ నెల 27న మండల పరిషత్ కార్యాలయంలో బస్‌పాస్‌లు అందజేయనున్నట్లు వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనిపెంట గురవారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సదరన్ సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు పొదిలి ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌పాస్‌లు అందజేస్తారన్నారు. దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలు, రూ.100 నగదు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయానికి రావాలని కోరారు.

పొగాకులో అన్య పదార్థాలు తొలగించాలి



ఉప్పలదిన్నెలో గ్రేడింగ్ బుట్టలు అందజేస్తున్న బోర్డు అధికారులు

పొన్నలూరు: పొగాకులో అన్య పదార్థాలు తొలగించి నాణ్యమైన పొగాకు తీసుకురావాలని జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉప్పలదిన్నెలో గురువారం కందుకూరు పొగాకు బోర్డు ఒకటో వేలం కేంద్రం, జీపీఐ కంపెనీ ఆధ్వర్యంలో పొగాకు రైతులకు వ్యక్తిగత రక్షణ పరికరాలు(పీపీఈ కిట్లు), రాయితీ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీపీఐ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ అల్లిక కోసం విరిచిన ఆకులకు ఎక్కువగా ఎండ తగలకుండా పట్ట కప్పాలన్నారు. పొగాకు అల్లిన కర్రలను బ్యారన్‌లో అధికంగా పెట్ట కూడదన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకొని పొగాకులో వచ్చే అన్య పదార్థాలు అందులో వేయాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వాహణాధికారి మీనా, జీపీఐ కంపెనీ ప్రతినిధి అనీల్, మన్నెం రవణయ్య, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.